విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 17, నవంబర్ 2024

ఏపీఓ మల్లికార్జునపై కేసు నమోదు చేయాలి

వెంకటరామిరెడ్డి కుటుంబానికి 50లక్షల ఎక్స్‌గ్రెసియా చెల్లించాలి.. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు..

విశాలాంధ్ర-డోన్ : మండలంలోని కొత్త బురుజు గ్రామానికి చెందిన వివోఏ వెంకటరామిరెడ్డి మృతికి కారణమైన ఏపీవో మల్లికార్జున, ఈశ్వరమ్మలపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి మృతుడు కుటుంబాన్ని ఎక్స్ గ్రేసియో 50లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.సుంకయ్య, కె.రాధాకృష్ణ, డోన్ మండల కార్యదర్శి బి.నారాయణ, పట్టణ కార్యదర్శి మోట రాముడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివోఏ వెంకటరామిరెడ్డి పై,తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారిన పొదుపు ఏపీఎం మల్లికార్జున,సీసీ ఈశ్వరమ్మల వేధింపులు తారా స్థాయికి చేరి రాజీనామా చేయాలంటూ నిత్యం వేధింపులకు గురి చేసారన్నారు. గ్రామైక్య సంఘం సమావేశం ఏర్పాటు చేయండని, సభ్యులు వ్యతిరేకిస్తే రాజీనామా చేస్తానని వెంకటరామిరెడ్డి నెత్తి, నోరు మొత్తుకున్నా అధికారులు వినేవారు కాదన్నారు. పైగా వెంకటరామిరెడ్డిని వివోఎ గా తొలగించామని,గ్రామంలో దండోరా వేయించడమే గాక బలవంతంగా రికార్డులు స్వాధీనం చేసుకొని గ్రామంలో మా కుటుంబాన్ని అవమానం చేశారని, తీవ్ర ఆవేదన గురై మానసికంగా వేధింపులకు గురి చేయడంతో అవమానాలను భరించలేక మానసిక ఆందోళనకు,తీవ్ర మనస్థాపానికి గురి అయిన ఆయన గుండెపోటుతో మరణించారన్నారు.ఆయన మరణానికి కారణమైన ఏపిఎం మల్లికార్జున,సీసీ ఈశ్వరమ్మ కారణమని వారిని వెంటనే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదుచేసి విచారణ చేపట్టి వెంకట్రామిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అధికార పార్టీకి తొత్తులుగా మారిన డోన్ ప్రాజెక్టు వెలుగు అధికారులు ఏపిఎం,సీసీలు వెంకటరామిరెడ్డి తో పాటు ఇంకా కొంత మంది వివోఎ లను ఇదే విధంగా తొలగించి ఎన్నో సంవత్సరాలుగా జీవనోపాధి పొందుతున్న వారి కుటుంబాలను వీధులపాలు చేయడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన వివోఎ లను వెంటనే విధులలోకి తీసుకోవాలని, నిబంధనలను అతిక్రమించి వెంకటరామిరెడ్డి మరణానికి కారణమైన ఏపిఎం మల్లికార్జున,సీసీ ఈశ్వరమ్మ లను వెంటనే సస్పెండ్ చేసి, వారిపై విచారణ జరిపి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని,వారు ప్రభుత్వాధికారులను డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బంది పైన మధ్యాహ్న భోజన పథకం,ఆశా వర్కర్స్,అంగన్వాడి వర్కర్స్ వేధింపులను మానుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ జోక్యం చేసుకొని వెంటనే వీరికి న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు లేని పక్షంలో పెద్ద ఎత్తున వెలుగులు కార్యాలయం ముందు ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

చినుకు పడితే చిత్తడే

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని చింతలాయిపల్లి లో ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికె చిత్తడిగా మారుతున్నది. వర్షపు నీరు ప్రధాన రహదారిపై నిలిచిపోతుండడంతో వృద్ధులు చిన్నారులు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా వర్షపు నీరు వెళ్లేలా కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండు వరుసల సిసి రోడ్డు అయినప్పటికీ వాహన దారులకు ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇతర పట్టణాలకు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ కూడా విపరీతంగా పెరిగింది. ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లేటప్పుడు నీరు మీద పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని వెళ్తున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు పాదాచార్ల రహదారిపై నిలిచిన వర్షపు నీరు పడి ఇబ్బంది పడుతున్నారు.ప్రధాన రహదారి లోని ఆర్ఎంపీ డాక్టర్ ఇంటి వద్ద నుండి మూడు రోడ్ల వరకు వర్షపు నీరు నిలిచిపోతున్నది. అధికారులు రెండు వరుసల సిసి రోడ్డు నిర్మించినప్పటికీ ఇరుపక్కల కాలువల ఏర్పాటు చేయకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలువకుండా కాలువలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

18న సచివాలయాల వద్ద ఆందోళన

విశాలాంధ్ర - రుద్రవరం : ఇల్లు లేని పేదలకు ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వ్యక్తిగత అర్జీల సమర్పణకై ఈనెల 18న సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో ఆయన ఇల్లు లేని పేదలను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి ఇంటి స్థలాన్ని మంజూరు చేసేలాగా వ్యక్తిగత దరఖాస్తులను అందించారు.

నంద్యాలలో రాష్ట్ర స్థాయి పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా కనోయింగ్ , కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అసోసియేషన్ సహకారంతో నంద్యాల చిన్న చెరువు నందు రాష్ట్ర స్థాయి కనోయింగ్ ,కయాకింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాల నుండి సుమారు 130 మంది క్రీడాకారులు ఈ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్, అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, రామకృష్ణ విద్యాసంస్థలు అదినేత డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, ఐఎంఏ నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ డా.మధుసూదన్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ఈ పోటీలు నంద్యాలలో జరుగుతున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులను అభినందించారు.ఈ క్రీడను నంద్యాలలో ఏర్పాటు చేసినందుకు అభినందిస్తూ, క్రీడా మంత్రికి తమ తరఫున వినతిపత్రం అందజేస్తామన్నారు. ఎఎస్పీ యుగంధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను క్రీడలపై మక్కువ పెరిగేలా ప్రోత్సహించాలని తెలిపారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో వినూత్నంగా ఈ తరహా పోటీలు జరగడం అభినందనీయమని,ఆహ్లాదకర వాతావ రణంలో ఈ పోటీలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీలు ఆదివారంతో ముగియబోతున్నాయని నంద్యాల జిల్లా అసోసి యేషన్ ప్రెసిడెంట్ మెహమ్మద్ రఫి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అపర్ణ తెలిపారు.

తహాశీల్దారు సక్రమంగా విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : నంద్యాల జిల్లా కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో తహాశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న అధికారి సక్రమంగా విధులు నిర్వహించాలని నంద్యాల సిపిఐ పట్టణ కార్యదర్శి కే.ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయం నందు పత్రికా ప్రకటనలో విలేకరులకు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహాశీల్దారు కార్యాలయానికి సంతకాల కోసం దరఖాస్తులు తీసుకొని వస్తున్న వివిధ రంగాలకు చెందిన ప్రజలకు కాళ్లు అరిగేలా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆయన అన్నారు.రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో పట్టణ ప్రజలను కలుపుకొని ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఆల్ ఇండియా సౌత్ జోన్ క్రీడలకు శాంతిరాం విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-పాణ్యం : మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థులు శ్రీనివాసరెడ్డి, హుస్సేన ఆల్ ఇండియా సౌత్ జోన్ హ్యాండ్ బాల్ క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు

శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15న పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్టీయూఏ హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలలో విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 2025 ఫిబ్రవరిలో తమిళనాడు సేలం జిల్లా పెరియార్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం శాంతి రాముడు, ఎండి శివరాం, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డి, హెచ్ ఓ డి ఫారూఖ్ అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెగ్డే సత్యనారాయణ కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న సందర్భంగా టిడిపి నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. వెలుగోడు పట్టణ అధ్యక్షులు ఖలీల్, రైతు సంఘము అధ్యక్షులు చెలిమిళ్ల సూర్యనారాయణ, తెలుగు శ్రీను, ముజీబ్, మనోహర్‌లు పాల్గొన్నారు. అలాగే గ్రంథాలయ వారోత్సవాలులో భాగంగా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమములో పాల్గొన్న ఉద్యమ కారులను స్మరించుకోవడం జరిగింది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు పొందిన సత్యనారాయణ ను గ్రంథాలయ అధికారిణి సుమలత, టీడిపి నాయకులు ఉస్మాన్ సన్మానించారు.

విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విశాలాంధ్ర - చాగలమర్రి : సచివాలయల సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. శనివారం మండలంలోని పెద్దబోధనం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆయన వివధ రికార్డులను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. పిఆర్ ఏఈ కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్,వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి,ఇంజనీరింగ్ అసిస్టెంట్ రుక్సానా,డిజిటల్ అసిస్టెంట్ మధులత తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ హక్కులను గౌరవించండి

- కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయండి
- సీమలో ఏర్పాటు చేసిన కార్యాలయాల తరలింపును నిలుపుదల చేయండి
- బొజ్జా దశరథరామిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : శ్రీబాగ్ ఒడంబడిక, రాజ్యాంగం, రాష్ట్ర విభజన చట్టం రాయలసీమకు కల్పించిన హక్కులను గౌరవించాలని, హైకోర్టులో కర్నూలులో ఏర్పాటు చేయండని, రాయాలసీమలో ఏర్పాటు చేసిన కార్యాలయాల తరలింపును నిలుపుదల చేయండని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ హక్కుల పత్రమైన శ్రీబాగ్ ఒడంబడిక జరిగి సరిగ్గా 87 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఒప్పంద పత్రంలోని కీలక అంశాలైన కృష్ణా, తుంగభద్ర నదీ జలాలలో ప్రథమ ప్రాధాన్యత, పాలనా వికేంద్రీకరణలో భాగంగా రాజధాని, హైకోర్టులాంటి హామీలను నేటికీ ఏర్పాటు చేయకపోవడం పట్ల రాయలసీమ సాగునీటి రంగంతో పాటు అన్ని రంగాలలో వెనుకబడటమే గాకుండా పాలనా వికేంద్రీకరణలో కూడా రాయలసీమ ప్రాంతం వివక్షతకు గురవుతోందన్నారు.సమావేశంలో లాయర్ కృష్ణారెడ్డి, ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఎజియమ్ శివనాగిరెడ్డి,రైతు నాయకులు ఉప్పలపాటి బాలీశ్వరరెడ్డి,బెక్కం రామసుబ్బారెడ్డి, కొండారెడ్డి, ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, పాణ్యం రైతు నాయకులు మురళీధర్ రెడ్డి, రామప్రసాదరెడ్డి, రామ సుబ్బారెడ్డి, వెలుగోడు రైతు సంఘం నాయకులు నస్రుల్లా ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ వచ్చే... పంట నేల వాలే

వందల ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట.. ఆందోళనలో రైతన్నలు.. ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం.. అందించాలంటున్న రైతులు..

విశాలాంధ్ర - రుద్రవరం : ప్రకృతి వైపరీత్యాలతో ప్రతి ఏడాది రైతులు ఏదో ఒక రూపంలో పంట చేతి కందె సమయానికి తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుకాలం కష్టించి శ్రమించి పండించిన పంటలు ఇంటికి వచ్చే సమయంలో భారీ వర్షాలు, తుపానుల బీభత్సం కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు.లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు నేల పాలు అవుతున్నాయి. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న తుఫాను కారణంగా మండలంలోని పలు గ్రామాలలో మొక్కజొన్న,వరి పంట పూర్తిగా దెబ్బతిన్నాయి.రుద్రవరం మండలంలోని నరసాపురం, తిప్పారెడ్డిపల్లె, ఆలమూరు, చిత్తరేనిపల్లి, హరి నగరం, ముకుందాపురం,తిప్పారెడ్డిపల్లి, టి లింగం దిన్నె, రుద్రవరం,ఆర్ నాగులవరం, అప్పనపల్లి, పెద్ద కంబలూరు,చిన్న కంబలూరు, శ్రీరంగాపురం, ఎల్లావత్తుల,బీరవోలు, చందలూరు, మందలూరు, తదితర గ్రామాలలో ఖరీఫ్ లో ముందస్తుగా సాగుచేసిన వరి పంట పూర్తిగా కోత దశ లో ఉండగా గత మూడు రోజుల నుంచి తుఫాను కారణంగా వీస్తున్న గాలి వర్షాలకు పూర్తిగా నేలకు ఒరిగింది. నరసాపురం గ్రామానికి చెందిన గుర్రంపెద్ద పక్కీరయ్య దాదాపు 10 ఎకరాలలో ఎకరాకు రూ 40 వేలకు పైగా పెట్టుబడులు పెట్టి వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం తుఫాను కారణంగా 10 ఎకరాలలో సాగుచేసిన వరి పంట పూర్తిగా నేలకు ఒరగడంతో వరి పంట పూర్తిగా దెబ్బతినింది. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల దాకా దిగుబడి వస్తుందని చేసిన అప్పులన్నీ తీరుతాయని ఎంతో ఆశతో ఉన్న సమయంలో ఇలా తుఫాను, గాలి కారణంగా వరి పంట పూర్తిగా దెబ్బతిన్నదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి పంటకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు.

వ్యక్తిగత అర్జీలతో సిద్ధం కండి

విశాలాంధ్ర - డోన్ : పేదల ఇంటి స్థలాల కోసం ఈనెల 18వ తేదీన గ్రామీణ పట్టణాలలో సచివాలయం దగ్గర వ్యక్తిగత అర్జీలతో సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు.శుక్రవారం రాత్రి మండలంలోని చనుగొండ్ల గ్రామ శాఖ సమావేశం శాఖ సమావేశానికి శాఖ కార్యదర్శి కేశన్న అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో 1 సెంటు చొప్పున ఇళ్లస్థలాల పట్టాలు ఇవ్వడం జరిగింది. ఆయా స్థలాలు పట్టణాలకు సుదూరంగా నిరూప యోగ్యంకాని ప్రాంతాలలో కేటాయించడం జరిగిందని,అందులో చాలామంది పేదలకు ఇప్పటివరకు ఇళ్లస్థలాలు చూపలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే 1 సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదని సీపీఐ ఆనాడే వైసిపి ప్రభుత్వానికి చెప్పినప్పటికీ ఖాతరు చేయకుండా మొండిగా ముందుకెళ్లిందన్నారు.కావునా అర్జీలు అందజేయాలనీ సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బి. నారాయణ, పట్టణ కార్యదర్శి మోట రాముడు,మండల సహాయ కార్యదర్శి హుస్సేన్ పీరా, వరదరాజులు, రైతు సంఘం నాయకులు సుధాకర్,దస్తగిరి, అక్బర్, రామనాయుడు, రాంబాబు నాయుడు, బాలరాజు, రాజన్న, సుధాకర్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

57వ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూలు రంగనాథన్, పోతూరి నాగభూషణం అయ్యంకి వెంకటరమణయ్య తదితర స్వతంత్ర పోరాట యోధులను స్మరించుకోవడం జరిగిందన్నారు. 17వ తేదీన మన రాష్ట్రంలో స్వతంత్ర పోరాటంపై ప్రముఖులు స్థానిక స్వతంత్ర సమరయోధుల ప్రసంగాలు 18వ తేదీన గ్రంథాలయ ఆవశ్యకతపై విద్యార్థులకు ఆసన 19వ తేదీన మహిళా దినోత్సవం 20వ తేదీన జాతీయ గ్రంథాల వారోత్సవాల ముగింపులో భాగంగా పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం చేస్తామని తెలిపారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను పొందటానికి పోస్టల్ సేవలను ఉపయోగించుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్స్పెక్టర్ రామనాథ్ అన్నారు. శనివారం ఉయ్యాలవాడ మండల కేంద్రంలో పోస్టల్ అధికారులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన సంక్షేమ పథకాలను లబ్ధి పొందాలనుకుంటే వాటికి రాష్ట్ర ప్రభుత్వం లింకు తప్పనిసరి అని ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన తపాలా సంస్థను సంప్రదించిందని అందులో భాగంగానే మండల ప్రజలందరూ లింకు తప్పనిసరి చేసుకోవాలని ర్యాలీ ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాలవాడ సబ్ పోస్ట్ మాస్టర్ గురువయ్య, ఎంవోలు భాస్కరరావు పెద్దరాజు పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి తోపాటు పోస్టల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ

విశాలాంధ్ర - మిడుతూరు : 2025-2026 గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో దశరథ రామయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రమైన మిడుతూరు లోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల అభివృద్ధిపై సర్పంచులు, ఎంపీటీసీలు ,కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ అనురాధ మాట్లాడుతూ గ్రామపంచాయతీ లలో అభివృద్ధి పనులు చేపట్టడంలో సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు భాగస్వామ్యం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి సంజన్న, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వేమారెడ్డి రేణుకా దేవి,వరలక్ష్మి, వెలుగు అధికారులు,సచివాలయ డిజిటల్ సహాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : ఎన్నికలలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ప్రకటించిన హామీలను నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్ ధనుంజయ్‌లు డిమాండ్ చేశారు. ఇటీవల నంద్యాల జిల్లా ప్రథమ మహాసభల్లో ఏఐఎస్ఎఫ్ ఎన్నికైన కమిటీ నిర్ణయించిన తీర్మానాలను శనివారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయం నందు అధ్యక్ష కార్యదర్శులు పత్రికా విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చినటువంటి హామీల్లో భాగంగా ఇంటర్ విద్యార్థు లకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగా అభివృద్ధి కోసం ప్రభుత్వ ఐటిఐ, మహిళా డిగ్రీ కళాశాల, టిటిసి, బీఈడీ కళాశాల ను ఏర్పాటు చేయాలని, సొంత భవనాలు లేనటువంటి హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి ఇవ్వాలని, నూతనంగా ఏర్పాటు అయినటువంటి మెడికల్ కళాశాలకు నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలనే అంశాలపై చర్చించి రానున్న రోజుల్లో ఈ అంశాల సాధన కోసం నంద్యాల జిల్లా ప్రధాన మహాసభలు వేదిక కావాలన్నారు. కాగా నంద్యాల జిల్లా విద్యారంగ అభివృద్ధికి ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానాలు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు.ముఖ్యుల సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనసురేష్,ఎర్రిస్వామి,మహానంది,రంగరత్నం, ఉదయ్,వినోద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : ప్రజలను చైతన్య పరచడంలోనూ, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైనదని అలాంటి రంగంలో రాణిస్తూ ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని పాత్రికేయులు కోరారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పాత్రికేయుల ఆధ్వర్యంలో స్థానిక మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహమునకు పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించి జాతీయ పత్రిక దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పాత్రికేయులు ఒకరినొకరు జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పాత్రికేయులు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న దురాగతాలను ఎండగడుతూ, అవినీతి అక్రమాలను వెలికి తీసి,ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు ఎంతో కృషి చేస్తున్నారన్న విషయాన్ని తెలియజేశారు. మీడియా రంగంలో రాణిస్తున్న అర్హత కలిగిన పాత్రికేయులు అందరికీ ఇంటి స్థలాలు మరియు అక్రిడేషన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. పాత్రికేయులు తమ విధి నిర్వహణలో ఎన్నో దాడులకు గురవుతున్నారని , విలేకరులపై జరిగే దాడులను అరికట్టాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు విశాలాంధ్ర విలేఖరి ఆంజనేయులు, సాక్షి నాగేష్,దిశ పగడం జయరాజు, నంది దినపత్రిక పగడం గోపి, టెన్ టీవీ జలీల్, ఆంధ్రప్రభ స్వామన్న,ఈనాడు శీను, కందనవోలు స్వామన్న,దేశ పోరాటం దక్కజములయ్య, ప్రభా న్యూస్ ఖలీల్, ఉత్తేజిత ఉశేనాలం, ప్రజా ప్రతిభ అబ్దుల్లా ,దీక్ష ప్రభ రహమతుల్లా , మనం మారెన్న తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వహణపై ఉక్కుపాదం

విశాలాంధ్ర - శిరివెళ్ల : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా మట్కాజూదం పై ఉక్కుపాదం మోపనున్నట్లు శిరివెళ్ల సి ఐ వంశీధర్ పేర్కొన్నారు.నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజిత్ సింగ్ ఆదేశాల మేరకు మట్కా నియంత్రించుటకు విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. శిరివెళ్ల సిఐ వంశీధర్,సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ . సురేష్ కుమార్,రేవనూరు సబ్ ఇన్స్పెక్టర్ .భూపాలుడు మరియు వారి సిబ్బంది తనిఖీలు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి మట్కాకు సంబందించిన 92 చీటీలను మరియు 2,65,317/-రూపాయలను స్వాదినం చేసుకున్నట్లు తెలిపారు. సిరివెళ్ల మండలం గోవింద పల్లె గ్రామానికి చెందిన అయ్యల చిన్న యాకోబు,కంచర్ల వెంకట రమణ. ఇరుగుదిండ్ల సురేశ్, గడ్డం జర్మియ, మరియు మరో ఇద్దరి వద్ద నుండి మట్కాకు సంబందించిన 92 చీటీలను మరియు 2,65,317/-రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.ఈ సందర్భంగా మట్కా నిర్వాహకులు ఎవరైన ప్రజలకు అధిక డబ్బులు వస్తాయని ఆశ చూపించి పేద ప్రజల జీవితాలను మట్కా అనే జూదం వైపు మరల్చి వారి జీవితాలను నాశనం చేయుటకు పాల్పడిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మరియు జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు ఇలాంటి జూదం పై దాడులు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

విశ్రాంతి గ్రంథాలయ అధికారులకు సన్మానం

విశాలాంధ్ర- బనగానపల్లె: శాఖ గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమ పితామహుల చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత గ్రంథాపాలకులు పి.నరసింహారెడ్డి,పి.రాఘవరెడ్డి,ఎం.వెంకటేశ్వర్లు,పి.మెహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పి.నరసింహారెడ్డి మాట్లాడుతూ మహానుభావులు గాడిచర్ల హరీష్ సర్వోత్తమ రావు మన సంద్యాల మొట్ట మొదటి ఎమ్మెల్యేగా గెలుపొందారని, వారు వయోజన విద్య వారి కాలంలో ప్రారంభించ బడినదని, వారు గ్రంథాలయాలకు ఎనలేని సేవలందించారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జలాల్ బషీర్ అహ్మద్ విశ్రాంత గ్రంథాలయ అధికారులకు శాలువ, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ పాఠకులు యాగంటయ్య, సుబ్రహ్మణ్యం , జి శివరామిరెడ్డి మరియు ప్రియదర్శిని స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరం

విశాలాంధ్ర-అవుకు : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు,చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు (72) మృతి పట్ల అవుకు మండల టిడిపి సీనియర్ నాయకులు గూడాల మురళీధర్ రెడ్డి,ప్రతాప్ రెడ్డిలు సంతాపం వ్యక్తం చేశారు.గూడాల సోదరులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని,చంద్రగిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో పేదలకు అండగా ఉండి,పలు సేవా కార్యక్రమాలు చేశారన్నారు.ఆయన మృతి చెందడం టిడిపికి తీరని లోటన్నారు.

ఇంటి స్థలాల కోసం అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర-అవుకు : గ్రామ,పట్టణంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్న రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు అవుకు పట్టణంలో ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ బాలకృష్ణ ఆధ్వర్యంలో శనివారం అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు స్థలాలు ఇవ్వాలన్న రాష్ట్ర నాయకత్వ పిలుపులో భాగంగా అర్జీలు స్వీకరించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాగాంజనేయులు, బాల ఉసేని, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన గని గ్రంథాలయం

విశాలాంధ్ర - పాములపాడు : గ్రంథాలయాలు విజ్ఞాన గని లాంటివని మండల టిడిపి సీనియర్ నాయకులు దాడిచర్ల హరిసర్వోత్తమరావు తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవల సందర్భంగా శనివారం గ్రంథాలయ అధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు .గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు బిడాక్టర్ అయ్యంకి వెంకట రమణయ్య, రంగనాథన్‌బి వారి చిత్రపటాలకు పూలమాలవేసి, నివాళులు అర్పించి వారిని స్మరించుకోవడం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నబి రసూల్,నాగిరెడ్డి ,లింగస్వామి, బాలస్వామి, శీను , మద్దిలేటి, కంబాలపల్లి రమణ, వెంకటేశ్వర్లు పాఠకులు రాముడు గౌడు, వీరన్న పాలొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 17, నవంబర్ 2024

గత ప్రభుత్వ హయాంలో భారీ అవకతవకలు

279 అనుమతులు లేని లేఅవుట్‌లు – అవినీతి చేసిన సొమ్ముకక్కిస్తాం.. జైలుకు పంపుతాం... కుడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కుడాలో గత ప్రభుత్వం హయాంలో బారీ అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ చేయించి అవినీతి పనులను జైలుకు పంపుతామని కుడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కుడా కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5సం కుడా ఏమి చేసింది, ఎంత ఆదాయం వచ్చింది అన్న దానిపై గత రెండు రోజుల నుండి పరిశీలించడం జరిగిందన్నారు. కుడా పరిధిలో ఇప్ప వరకు 279 అనుమతులు లేని లేవుట్‌లు ఉన్నాట్లు గుర్తించామన్నారు. పంచాయతీ కార్య దర్శులు అన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా అలా చేయ లేద న్నారు. పంచాయతీ కార్యదర్శులో రెండు రోజుల పాటు దీనిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. బనవాసి, ఆళ్ళగడ్డ, బుగ్గాని పల్లె వద్ద ఎన్‌టీఆర్ టౌన్‌షిప్ పేరుతో కుడా ఆద్వర్యంలో ప్లాట్లు వేస్తున్నామని వాటిని తక్కువ ధరకు విక్రయించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి తప్పు జరిగినట్లు రుజువైతే జైలుకు పోకతప్పదన్నారు. వారి అవినీతిని బట్టబయలు చేస్తామన్నారు. డీకే ల్యాండ్‌లో ఎలా లేఅవుట్‌లు వేస్తారని ప్రశ్నించారు.చాలా చోట్ల డీసీ భూముల్లో కూడా లేఅవుట్‌లు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. భూమిని కొనుగోలు చేసే వాళ్లు విచారణ చేసుకొని కొనుగోలు చేసుకోవాలన్నారు.గత ప్రభుత్వం హయాంలో పనిచేసిన అధి కారులు అవినీతి ఇరుక్కుపోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవినీతికి తావులేకుండా పనిచేసి కుడా అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.ఈ సమావేశంలో కుడా అదికారులు భాస్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

వాలంటరీ వ్యవస్థను కొనసాగించాలని మౌన ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : వలంటీర్స్ వ్యవస్థను కొనసాగిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేయాలని వారి పెండింగ్ జీతాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ వాలంటీర్స్ అసోసియేషన్ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు నోటికి కట్టుకొని మౌన ప్రదర్శన చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి వాలంటీర్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, వాలంటీర్స్ సుకన్య, మక్బూల్ బాషా,గోవిందమ్మలు మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నాయకుడు హెూదాలో ఉండి 45 ఏండ్ల రాజకీయ అనుభవం ఉంది వాలంటీర్స్ ఆందోళన చెందవద్దని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మిమ్మల్ని కొనసాగిస్తామని జీతం 10 వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి ఐదు నెలల గడుస్తా ఉన్న ఇప్పటివరకు వాలంటీర్స్ గురించి మాట్లాడకపోవడమే కాకుండా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వాలంటీర్స్ వ్యవస్థలేదని, వారికి సంబంధించిన జీవోలు లేవని చెప్పడం సిగ్గుచేటన్నారు. వాలంటీర్స్ సంబంధించిన జీవో నెంబర్ 33,104 ఒక్కసారి చూసుకోవాలని వారు పవన్ కళ్యాణ్‌కి సూచించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో రాష్ట్రంలో నిరసన తెలియజేసే హక్కును కాల రాస్తున్నారన్నారు. పదేపదే మాట్లాడిన ప్రస్తుత సీఎం, డిప్యూటీ సీఎం, మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హెూం శాఖ మంత్రి వెలగపూడి అనిత మీరు అధికారం చేపట్టిన తర్వాత ఈనెల తొమ్మిదో తేదీన చేసిన పని ఏమిటని వారు ప్రశ్నించారు. వాలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలంటీర్స్ ఆవేదన సదస్సు నిర్వహిస్తే పోలీస్‌లు వాలంటీర్లకు, ఏఐవైఎఫ్ నాయకులకు 41 నోటీసులు ఇవ్వడం కొంతమందిని అరెస్టు చేయడం సదస్సును ధర్నా అని తప్పుడు ప్రచారం నిర్వహించి సదస్సును అడ్డుకున్నప్పటికీ వందలాది మందితో నిర్వహించామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకుండా వాలంటీర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని లేనిపక్షంలో ఇప్పుడు మౌన ప్రదర్శన నిర్వహి స్తున్నామని భవిష్యత్తులో ఉద్యమాలను ఉదృతం చేస్తామని దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బాబయ్య ,ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, నగరనాయకులు చంటి,నాగరాజు,శివాజీ,వాలంటీర్లు రాజశేఖర్, ప్రభాకర్,సుకన్య,రామాంజినేయులు,రెస్మా,గౌసియా, రామాంజి,రవి,తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. శనివారం సుంకేసుల రోడ్డులోని పాత పంప్‌హౌస్, బిర్లా కాంపౌండ్‌లోని ఖానా-ఖజానాను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో జన తాగునీటి దాహార్తిని తీర్చేందుకు పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అందులో భాగంగా పాత పంప్‌హౌస్ వద్ద 3 ఎంఎల్‌డి సామర్థ్యంతో మరో నూతన నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం బిర్లా కాంపౌండ్ వెళ్ళిన కమిషనర్, ఖానా-ఖజానా నుండి సిల్వర్ జూబ్లీ కళాశాల వైపునకు వెళ్లే రహదారిలో అడ్డంగా ఉన్న గోడను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.రాజశేఖర్, డిఈఈ మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ : నగరంలోని అబ్బాస్ నగర్‌లో బీసీ స్టడీ సర్కిల్ నందు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీసీ వెల్ఫేర్ వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత డీఎస్సీ కోచింగ్ వెనుకబడిన కులాలకు కొరకు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కోచింగ్ 60 రోజులపాటు ఉంటుందన్నారు వారికి కూడా ప్రభుత్వం ద్వారా వచ్చే స్టైఫాయిడ్ కూడా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ అధికారులు రామా గోపాల్‌లు పాల్గొన్నారు

గ్రామాభివృద్ధే టీడీపీ లక్ష్యం

విశాలాంధ్ర - కల్లూరు : గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే టీడీపీ లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకులు రమణ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు పల్లె పండగ వారోత్సవాల సందర్భంగా మా గ్రామ అభివృద్ధ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద మంజూరైన సీసీ రోడ్డులు ఆధ్వర్యంలో శరవేగంగా చక్కటి క్వాలిటీతో వేయడం జరుగుతుంది. గ్రామ ప్రజలు ప్రభుత్వం మంచి పనులు చేస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

18న ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నందవరం : నందవరంలో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో 18న చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్ ,సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్యలు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బి ఎం ఆంజనేయులు సొంతన్న ,విజయ్ కుమార్ ,దేవరాజ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధనవంత్రి కాన్ఫ రెన్స్ హాల్‌లో మినిస్ట్రియల్ స్టాఫ్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సూపరింటెండెంట్ దాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది ప్రతి ఒక్కరు సమయ పాలన ,నిర్ణయించిన సమయంలో వారు అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎఫ్ ఆర్ ఎస్ అటెం డెన్స్ తప్ప కుండా వెయ్యాలన్నారు. యఆసుపత్రికి వచ్చే ప్రజలు ,ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే వాటిని త్వరగా పూర్తి చేయాలని ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లులు ఏవైనా పెండింగ్ ఉన్న వాటిని త్వరగా పూర్తిగా అయ్యేటట్లు చూడాలని సిబ్బం దికి ఆదేశించారు.మెడికల్ రికార్డ్ సెక్షన్‌లో బర్త్ మరియు డెత్ సర్టిఫికెట్ల కోసం వచ్చే వారికి త్వరగా సర్టిఫికెట్లు మంజూరు అయ్యేటట్లు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీరా ములు, ఆఫీస్ అకౌంటెంట్స్ కుమారస్వామి,లతీఫ్ బేగ్, ఆసుపత్రి ఏడి రమేష్ బాబు,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18న చలో సచివాలయం

విశాలాంధ్ర - పత్తికొండ : ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని కోరుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18 న సచివాలయాల ఎదుట జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ నాయకులు పట్టణంలోని బండిగేరి, రాజీవ్ నగర్, యశోద డ్వెల్లింగ్ కాలనీల లో ఇల్లు లేని నిరుపేదలను కలుసుకొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు నాగరాజు, ఉరుకుందు, రంగస్వామి ,కృష్ణ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : నగరంలో వాహనాల రాకపోకలు, జనసంచారం అధికమవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తిందని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు, సిసి కెమెరాల పనితీరును శనివారం పలు ముఖ్యమైన కూడళ్ళను కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆకస్మికంగా పరిశీలించారు. ముఖ్యమైన కూడళ్ళల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు చేపట్టాల్సిన కార్యచరణ ప్రణాళికపై ట్రాఫిక్ సిఐకి, ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. నగరంలోని పలు ముఖ్యమైన రద్దీ ప్రాంతాలైనా సి.క్యాంపు, నంద్యాల చెక్ పోస్టు, గాయత్రి ఎస్టేట్ వై జంక్షన్, ఎన్టీఆర్ సర్కిల్, ట్రాఫిక్ సిగ్నల్స్,ట్రాఫిక్ రద్దీ సమస్య గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు సిఐలు ప్రసాద్, అబ్దుల్ గౌస్, ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్,ట్రాఫిక్ ఆర్ ఎస్సై హుస్సేన్ ఉన్నారు.

రోడ్డుకు అడ్డంగా రాళ్ల బండలు

విశాలాంధ్ర - హెూళగుంద : హెూళగుంద ఊరువాకిలి వద్ద నిర్మించే డ్రైనేజ్ కోసం తగిన మట్టి, రాళ్లు, రాళ్ల బండలు, కంకర రాళ్లు అడ్డంగా వేయడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.అసలే ఇరుకైన రోడ్డులో డ్రైనేజ్ తగిలిన బండలు రాళ్లు వేయడం వల్ల వాహనాలు తిరగాలన్న కష్టంగా ఉన్నదని రోడ్డు గుంతలుగా ఉండడం వల్ల వాహనాలు అదుపుతప్పి కిందకు పడుతున్నాయని ప్రజలు తెలిపారు. రోడ్డును తవ్విన సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోయారు.సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రోడ్డుకు ఎలాంటి రాళ్లు, మట్టి కుప్పలు, కంకర రాళ్లు లేకుండా చూడాలని సీనియర్ టీడీపీ నాయకుడు గాలి వీరభద్ర గౌడ విజ్ఞప్తి చేశారు. పంచాయతీ గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ సమాధానమిస్తూ డ్రైనేజ్, సీసీ రోడ్డు పనులు జరుగుతున్నందున మట్టి కుప్పలు, కంకర రాళ్లు, రాళ్ల బండలు ఎత్తివేయలేకపోయామని వెంటనే సిబ్బందితో తొలగించడానికి శ్రద్ధ వహిస్తానని స్పష్టం చేశారు.

ఉచిత టీబీ మొబైల్ ఎక్రే వాహనాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఉచిత టిబి మొబైల్ ఎక్రే వాహనాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆదోని టీబీ వైద్యాధికారి డాక్టర్ షేకూన్ భాను, పెద్దకడబూరు వైద్యాధికారి తాహిర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆయన విలేఖరులతో మాట్లాడారు. 18న హెచ్ మురవణి,19న పెద్దకడబూరు,22న దొడ్డనగేరి గ్రామాలలో ఉచిత మొబైల్ ఎక్రే వాహనం పర్యటిస్తుందన్నారు.ఈ అవకాశాన్ని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బి.మురళినాయుడు

విశాలాంధ్ర - కోడుమూరు : వాల్మీకి (బోయ)ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గా కోడుమూరు పట్టణానికి చెందిన బోయ మురళినాయుడు ఎంపికయ్యారు.ఇటీవల కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేసిన విషయం తెలిసిందే.వివిధ కార్పొరేషన్ల చైర్మన్,డైరెక్టర్లు పదవుల భర్తీలో భాగంగా వాల్మీకి (బోయ)ఫెడరేషన్ కార్పొరేషన్ సభ్యులను నియమించింది. వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గా కోడుమూరుకు చెందిన మురళినాయుడును నియమించింది. ఈ మేరకు శనివారం మురళినాయుడు విలేకరులతో మాట్లాడుతూ గత 14సంవత్సరాల నుంచి భారతీయ జనతా పార్టీలో వివిధ బాధ్యతలలో సేవలందిస్తున్నందుకు నాకు ఈ అవకాశం దక్కిందన్నారు.రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వంలో వాల్మీకి బోయ వెల్ఫేర్ అండ్ స్టేట్ ఫెడరేషన్ కార్పొరేషన్ లో నన్ను డైరెక్టర్ గా నియమించినందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

పేదోడి ఇంటి కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు : పేదోడికి సొంతిల్లు కోసం ప్రభుత్వం 5లక్షల రూపాయలు మంజూరుచేయాలని 18న చేపట్టిన ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప అన్నారు. శనివారం సీపీఐ కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో స్వామి రెడ్డి నగర్, టీవీ9 ప్రజా నగర్ ,గిరిప్రసాద్ నగర్,బుధవారిపేట పూల సుబ్బయ్య నగర్, ఎన్‌జీ నగర్ ,రామచంద్ర నగర్, కస్తూరి నగర్ ,షరీఫ్ నగర్‌లలో మైకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాజరైన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప ,నగర సహాయ కార్యదర్శి మహేష్, నగర కార్యవర్గ సభ్యులు కుమార్ ,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, నగర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ నగరంలో వేలాదిమంది ఇల్లు లేక ఇబ్బందులు పడుతూ ఇంటి అద్దెలు కట్టుకోలేక నానా అవస్థలు పడుతుంటే ప్రభుత్వాలు మాత్రం పట్టి పట్టినట్లు వ్యవహరించడం చాలా దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాకముసుపు పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తానని గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల స్థలం ఇస్తానని చెప్పారు. ఆ హామీని నెరవేరుస్తూ పేదోడు ఇల్లు కట్టుకో వడానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే నగరంలో ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించా లన్నారు. ఈనెల 18వ తేదీ రెండు సెంట్లు భూమి సాధన కోసం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాకు సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు రామాంజనేయులు గౌడ్ ,కోటమ్మ , శైలజ ,అమినాబి, కుమార్ ,నీలకంతప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష..

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 19 నుండి డిసెంబర్ 10 వరకు జిల్లా అంతటా "హమారా శౌచాలయ,హమారా సమ్మాన్" పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో "హమారా శౌచాలయ హమారా సమ్మాన్" కార్యక్రమంపై ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో, జిల్లా పరిషత్ సీఈఓ, పంచాయతీ రాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "హమారా శౌచాలయ హమారా సమ్మాన్" కార్యక్రమాలను జిల్లా స్థాయి,నియోజకవర్గం, మండల స్థాయి, గ్రామ స్థాయిలలో నిర్వహించాలని, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరయ్యేలా చూడాలన్నారు. గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో, మండలాల్లో 19 న లాంచనంగా ప్రారంభం కావాలన్నారు.నవంబర్ 19 న టాయిలెట్లు మంజురైన వారందరికి మంజూరు లేఖలు అందించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించి ఉత్తమ వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్లకు బహుమతులను అందజేయాలన్నారు. సమావేశం లో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ .డ్వామా ఇంచార్జ్ పిడి నాసర రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, డిపిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ తోటల పెంపకంపై అవగాహన

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఫామ్ హౌస్ నందు లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఆయిల్ పామ్ మొక్కలను మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఫ్రాన్స్ శాస్త్రవేత్త నికోలస్, ఇండోనేషియా శాస్త్రవేత్త విజయన్, ఆయిల్ పామ్ టెక్నికల్ డైరెక్టర్ రంగనాయకులు, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాఘవేంద్రలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో వారు మాట్లాడుతూ వంట నూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం వలన విదేశీ మారక ద్రవ్యాన్ని ఎక్కువగా ఖర్చు చెయ్యడం జరుగుతుందన్నారు. దాదాపు 70 నుంచి లక్ష కోట్ల రూపాయల వరకు వంట నూనెలను దిగుమతి చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2022-23 సంవత్సరాల మధ్య 166 లక్షల టన్నుల వంట నూనెను దిగుమతి చేసుకోవడం జరిగిందని వారు వెల్లడించారు. మొక్కలు వంద శాతం రాయితీతో ఇవ్వడం జరుగుతుందని, హెక్టార్ కు 5వేల రుపాయలు చొప్పున 4 సంవత్సరాల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. మొక్కలను 3 సంవత్సరాలు సక్రమంగా పెంచినట్లైతే 35 నుంచి 40 సంవత్సరాల వరకు ఆదాయం ఇస్తుందన్నారు. కొనుగోలు, విక్రయాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. దళారి వ్యవస్థ లేని పంట, గుండె జబ్బులు రానటువంటి పంట ఆయిల్ పామ్ అన్నారు. ఆయిల్ పామ్ తోటలో అంతర పంటలుగా ప్రొద్దుతిరుగుడు, సోయాబీ, మినుము వేసుకోవచ్చునని తెలిపారు. కావున రైతులు ఆయిల్ పామ్ తోటలను పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు, మాజీ ఎంపిపి నరవ శశిరేఖ,టిడిపి నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజనేయ, అంజి, నరసన్న, బాబు ఉద్యాన శాఖ అధికారులు అపర్ణ, ఇందిర, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పట్టణంలోని పాత ఓల్డ్ బ్రిడ్జి సమీపంలో ఉన్న గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ 57వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి సుజాత మూడవ రోజు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు కీశే,,గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, కీశే,, అయ్యంకి వెంకట రమణయ్య,కీశే,,డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్,కీశే,, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయునిలు కేశమ్మ, శివ జ్యోతి,విశ్రాంతి ఉపాధ్యాయురాలు శారమ్మ పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు వారోత్సవాలకు గ్రంథాలయానికి రావడం మాత్రమే కాదు సెలవు రోజుల్లో గ్రంథాలయమును వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందిం చుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి ఆదివారం చదువు అంటే మాకు ఇష్టం కార్యక్రమం జరుగును కనుక తప్పకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సాహించి గ్రంథాలయమునకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ దేవేంద్ర, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రశంసా పత్రం అందుకున్న రాయపాటి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ బ్రెజిల్ దేశానికి చెందిన ది లాస్ట్ ట్రంపెట్ మిషన్ థియలాజికల్ ఇన్స్టిట్యూట్, ఇంటర్నేషనల్ ఐ.టి.ఎం.యు.టి యూనివర్సిటీ నుంచి అంతర్జాతీయ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాయపాటి మాట్లాడుతూ 2024 సంవత్సరానికి సంబంధించి సామాజిక దృక్పథంతో చేసిన సేవా కార్యక్రమాల కు గుర్తింపుగా ఇంటర్నేషనల్ ఐ.టి.ఎం.యు.టి యూనివర్సిటీ డైరెక్టర్ జార్జ్ జీసస్ట్ ఫెడల్స్ అంతర్జాలం ద్వారా అంతర్జాతీయ ప్రశంసా పత్రాన్ని అందజేశారన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

విశాలాంధ్ర - నందవరం : మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ యోజన పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను మాజీ సర్పంచ్, క్లస్టర్ ఇన్ ఛార్జ్ ఖాసీం వలి, ఎంపిడిఓ పుల్లయ్యలు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైన్లు, సిమెంట్ రోడ్లు వేయుటకు మాచాపురం గ్రామంలో పనుల గుర్తింపు కొరకై గ్రామములో తిరిగి గ్రామ పెద్దలతో పనులను లైన్ ఎస్టిమేట్ పనులు చేయడం జరిందన్నారు. పల్లె పండుగ ప్రోగ్రాంలో రూ.10లక్షలతో మంజూరైన సిమెంటు రోడ్డు పనులు పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే గ్రామంలో జరుగుతూ ఉన్న రైతు సేవ కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనములను పనులను కూడా పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎఇ నరసింహులు, ఇఓపిఆర్డి సందీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పెద్దరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

విశాలాంధ్ర - హెూళగుంద : మండలంలోని గజ్జహల్లిలో గురువారం కురిసిన వర్షానికి పిడుగు పడి పొలం పనిలో ఉన్న కురువ అనసూయ పిడుగు పాటుకు గురికావడంతో బంధువులు కర్నూల్ హాస్పిటల్‌కి తరలించారు. మహిళ అనసూయ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని విఆర్ఓ ప్రహల్లాద తెలిపారు. మహిళా మృతి పట్ల గజ్జిహళ్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. తల్లి మృతి పట్ల పిల్లలు ఆనాదులుగా మారారని బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబా నికి అధికారులు వెంటనే ఆదుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు శాఖా గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఉద్యమకారులను స్మరించుకోన్నారు. ఈ కార్యక్రమంలో గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యంకి వెంకటర మణయ్య,పోతూరు నాగభూషణం చిత్ర పటాలకు పూలమాలవేసి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని అదేవిధంగా ప్రతీ ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని, విద్యార్థులకు పాఠకులకు తెలియచేశారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సెవ్రి (వెస్ట్), ముంబయి 400015. మహారాష్ట్ర. CIN No.: U65922MH2005PLC272501

సెక్యూరిటైజేషన్ యాక్ట్ ఆఫ్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు.

ఏదైతే, వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, దీని హెడ్ ఆఫీసు ముంబయి ద్వారా, దిగువ రుణగ్రహీతలు/ హామీదారులు/ తాకట్టుదారులుకు ప్రకటన ఇవ్వడమేమనగా, విహెచ్ఎఫ్‌సిఎల్ నుండి వారిచే పొందిన రుణ సదుపయాలను అసలు మరియు వడ్డీలను తిరిగి చెల్లించుటలో డిఫాల్టెంది మరియు సదరు సదుపాయం నాన్-పెర్ఫామింగ్ అసెట్స్‌గా మారినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి వారు గతంలో తెలిపిన వారి చిరునామాలకు నోటీసు జారీచేయబడినది, అయితే అది వెనుదిరిగినది మరియు దానికి సంబంధించిన బహిరంగ ప్రకటన రూపేన ఇందుమూలంగా మీకు తెలియజేయబడుచున్నది.

రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు& రుణ ఖాతా నం.	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది& సమయం	తాకట్టుపెట్టిన అస్తి వివరణ
దస్తగిరి దూదేకుల (అభ్యర్థి), దస్తగిరమ్మ డి. (సహ-రుణగ్రహీత) HL000000010274	10 అక్టోబర్-24/ 09 అక్టోబర్ 24 నాటికి రూ. 16,57,249/- దానిపై తదుపరి వడ్డీ& చార్జీలు.	విశ్వనగర్ నూనె పల్లె గ్రామం, నంద్యాల, కర్నూలు, గాయత్రి టెంపుల్ దగ్గర, కర్నూలు, నంద్యాల, ఆం.ప్ర-518502 వద్ద సర్వే నం.408/1, డోర్ నం.28/850/బి-ఎ. విస్తీర్ణం 9874చ.గ.లు, ఉత్తరం: ఇతరుల సైటు, దక్షిణం: రోడ్డు, తూర్పు: ఇతరుల సైటు, పడమర: పి. లక్ష్మీనారాయణ సైటు.
ఆదినారాయణ బడ్డెల (అభ్యర్థి), ఈశ్వరమ్మ బడ్డెల (సహ-రుణగ్రహీత) LP000000019144	10 అక్టోబర్-24/ 09 అక్టోబర్ 24 నాటికి రూ.8,28,457/- దానిపై తదుపరి వడ్డీ& చార్జీలు.	రామాంజనేయ కళ్యాణమండపం దగ్గర, మారుతి నగర్, ధర్మవరం మున్సిపల్ ఏరియా, రామాంజనేమ కళ్యాణమండలం దగ్గర, ధర్మవరం, ఆం.ప్ర.-515671 వద్దగల సర్వే నం.494-1&3, డోర్ నం.29-570-2. పూర్తి విస్తీర్ణం 48చ.గల.లు. ఉత్తరం: దుస్స లక్ష్మమ్మ& ఇతరుల ఆస్తి. దక్షిణం: యెర్ర నారాయణ స్వామికు చెందిన షెడ్, తూర్పు: రోడ్డు, పడమర: పామిశెట్టి నారాయణ స్వామికు చెందిన ఇల్లు.

నోటీసు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోబడుచున్నవి. పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (ఎవరైతే వర్తించుదురో), ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజుల్లోగా బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది. విఫలం చెందిన పక్షంలో, ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకోబడుతాయి.
సదరు నోటీసు సెక్షన్ 13(13) క్రింద కూడా ఇవ్వబడినదని దయచేసి గమనించగలరు మరియు రుణగ్రహీతలు/ హామీదారులు/ తాకట్టుదారులు సదరు తాకట్టు ఆస్తిని విక్రయం/లీజు/బదిలీ చేయలేరని దయచేసి గమనించగలరు.

తేది: 17.11.2024
ప్రదేశం: కర్నూలు, ధర్మవరం

అధీకృత అధికారి,
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్.

ఏఐఎస్ఎఫ్ 49వరాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - దేవనకొండ : ఏఐఎస్ఎఫ్ 49 వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో నవంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం నందు మహా సభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ 49వ రాష్ట్ర మహాసభలకు విజయనగరం వేదిక కానుందని తెలిపారు. విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని తెలిపారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా కాషాయికరణ చేసే పద్ధతులలో జాతీయ నూతన విద్యా విధానం వల్ల ఇప్పటికే రాష్ట్రంలో చాలా విద్యాసంస్థలు మూతబడడం కూడా జరిగిందని తక్షణమే జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రంగన్న,మండల అధ్యక్ష,కార్యదర్శులు మధు,భాస్కర్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థల తరలింపు దుర్మార్గం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్.వి.మోహన్‌రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రామ్‌భూపాల్ రెడ్డి, మేయర్ బి.వై.రామయ్య,న్యాయవాదులు, పలువురు నాయకులు శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ పి.రంజిత్ భాషను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్.వి.మోహన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలులోని హెచ్ ఆర్‌సీ, లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు ఇలా ఇవన్నీ వైయస్ జగన్ ప్రభుత్వంలో కర్నూలులో ఏర్పాటు చేశారు, నేషనల్ లా యూనివర్సిటీకి ఫౌండేషన్ వేశారు,కానీ ఇవన్నీ అమరావతికి తరలిస్తున్నట్లు టీడీపీ ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం చాలా దుర్మార్గమన్నారు.రాయలసీమ వెనకబడిన ప్రాంతమని ఈ చర్య వల్ల మరింత వెనకబడుతుందని, దీనిని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వెనక్కితగ్గకపోతే న్యాయపరంగా, ప్రజా ఉద్యమాల ద్వారా ఎంత దూరమైనా వెళతాం, అన్ని రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలను కలుపుకుని ముందుకెళ్తామన్నారు.నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రామ్‌భూపాల్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు నుంచి న్యాయసంస్థలు అమరావతికి తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. వైయస్ జగన్ కర్నూలుకు జ్యుడిషియల్ క్యాపిటల్ ప్రకటించారని, కర్నూలు ప్రాంత ప్రజలు ఆలోచించాలన్నారు.కర్నూలు మేయర్ బీ.వై.రామయ్య, కర్నూలు మేయర్ మాట్లాడుతూ1953 నుంచి కర్నూలు నష్టపోయింది, శ్రీబాగ్ ఒడంబడికకు విరుద్ధంగా కర్నూలుకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణం చామకాల్వ వద్ద గల శ్రీ చైతన్య స్కూల్ నందు విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. యుగంధర్ బాబు, ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా,శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్, ఆర్ఐ కోటయ్యల ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ ఈజ్ కమ్యూనిటీ కన్సర్ అనే నినాదంతో రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు పోలీస్ అధికారులచే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వలన జరిగే పరిణామాలపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు మీరు పాటిస్తూ మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో చామకాలువ నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు స్పీడ్ థ్రిల్ బట్ ఇట్ కిల్స్, సేఫ్టీ ఫస్ట్ స్పీడ్ నెక్స్ట్ అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలం లోని పెద్దబోధనం గ్రామ సమీపంలో 40 వ జాతీయ రహదారి పై విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శనివారం జరిగిన ఆటో రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన నాగరాజు(26) తమ సమీప బంధువు సుధాకర్‌తో కలిసి కడప జిల్లా మైదుకూరు లో తమ ఆటోను మరమ్మత్తులు చేయించి తిరిగి స్వగ్రామం కు బయలు దేరాడు. పెద్దబోధనం సమీపంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను డీ కొట్టింది బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నారాజు అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్ళగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కనకదాసు జయంతిని ఘనంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలో భక్త కనకదాసుడి 537వజయంతిని కురువ కులస్తులు ప్రజలు ఘనంగా జరుపుకోవాలని ఎండి హళ్లి సర్పంచ్ కే.సుధాకర్ శనివారం విజ్ఞప్తి చేశారు. ప్రతి పల్లెలో కనకదాసుడి విగ్రహానికి లేక చిత్రపటానికి పూలమాలలు పూజలు చేయాలని అలాగే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కనకదాసు జయంతిలో కురువ సంఘం నాయకులు, కులస్తులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నాారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్ర రోడ్లు,భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఆయన మాట్లాడుతూ నారా రామ్మూర్తినాయుడు మృతి ఆయన కుటుంబంతో పాటు, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు తీరని లోటన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ఇవ్వాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీ నగర్ లో వెలసిన సత్యనారాయణ స్వామి దేవాలయం నందు దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుతున్నారు. సత్యనారాయణ స్వామి దేవాలయం నందు మనస దేవి,కుమారస్వామి,నాగదేవత గ్రహమూర్తులను ప్రతిష్ఠించనున్నారు.మూడు రోజులపాటు జరిగే ఈ ప్రతిష్టా కార్యక్రమంలో రెండో రోజైన శనివారము ఆలయ ప్రాంగణంలో హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా విగ్రహమూర్తులను వీధుల గుండా ఊరేగించారు. అనంతరం సాయంత్రం కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.మూడో రోజు ఐన ఆదివారం విగ్రహ మూర్తులను ప్రతిష్ఠించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తక పఠనం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - అవుకు : ప్రస్తుత పరిస్థితులలో విజ్ఞానాన్ని పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠ్నాన్ని అలవాటు చేసుకోవాలి అని అవుకు గ్రంథాలయ ఇన్చార్జ్ పి.రామదాసు అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో ఉద్యమకారులైన పోతులూరి నాగభూషణం,గాడిచర్ల హరి సర్వోత్తమరావు వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు వెంకటేశ్వరమ్మ, దానమ్మ, ఆయాలు, పాఠకులు బారు శ్రీరాములు, వెలుగు శ్రీరాములు, ఏసేపు,శివయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలందరూ సభ్యత్వం తీసుకోవాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలని జిల్లా టిడిపి బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు యాదవ్ తెలిపారు. శనివారం టీడీపీ ఇన్‌చార్జ్ యల్లంపల్లె సుబ్బారావు,టి ఎన్ టి యుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు ఆధ్వర్యంలో మైన్‌బజార్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం నమోదుకు రాష్ట్రంలో విశేష స్పందన లభిస్తోందని అన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదళ్ళపల్లె సత్యనారాయణ (అన్నయ్య),మధు,సుబ్రమాణ్యం,టైలర్ భాష,, కసినేనిఓబులేసు,బోడెల్ల మోహన్,సుబ్బారావు, లక్ష్మి,రామచంద్రుడు, నాగ,రాజా తదితరులు పాల్గొన్నారు.

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కోవెలకుంట్ల పట్టణంలోని శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థు లకు గాడి చెర్ల హరి సర్వోత్తమరావు జీవిత చరిత్ర గురించి వకృత్వ పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని తెలుగు పండిత్ సుధీర్ అధ్యక్షణలో గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకుడు మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యదర్శుల విధులకు భద్రత కల్పించండి

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల గ్రామపంచాయతీ కార్యదర్శుల యొక్క విధినిర్వహణలో భద్రతతో పాటు గౌరవప్రదమైన సముచిత స్థానం కల్పించాలని స్థానిక ఎంపీడీవో శివమల్లేశ్వరప్పకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. సచివాలయ సిబ్బందికి విధి నిర్వహణలో పనులను కార్యదర్శులు ఆదేశిస్తే వారు కార్యదర్శులను చులకనగా మాట్లాడడం విధుల పట్ల అలసత్వం వహించడం ఉన్నతాధికారులకు సత్య దూరమైనటువంటి అవాస్తవాలను తెలియజేయడం జరుగుతున్నదని గ్రామపంచాయతీ కార్యదర్శుల యూనియన్ నేతలు అభిప్రాయపడ్డారు. సచివాలయ సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక జీవో ద్వారా సచివాలయ సిబ్బంది చేయాల్సిన విధులను ఆదేశించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల యొక్క విధులకు భద్రతతో పాటు గౌరవప్రదమైన సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఓపి ఆర్ డి టీ ఎస్ ఎస్ శర్మ, గ్రామపంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రవిశంకర్ శర్మ,మనోహర్, షరిఫాబి, రాజ్ కుమార్భట్టు కుమార్,ఉమ,ఇతర కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఈత పోటీలు

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : కర్నూలు జిల్లా ఈత సంఘం నేడు ఉదయం పది గంటలకు డి ఎస్ ఏ జిల్లా ఈత పోటీలు బాల బాలికలకు నిర్వహించుచున్నారు. ఇందు లో ఎంపికైన వారు డిసెంబర్ నెల 7 నుంచి 8వ తేదీల్లో విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా పాల్గొంటారని వారు తెలిపారు. ఎంపికైనలో పాల్గొను టకు వయో విభాగాలు గ్రూప్ వన్ 2007,2008 , 2009 సంవత్సరాలలో పుట్టిన వారు, గ్రూప్ టు 2010 ,2011 2012 సంవత్సరంలో పుట్టిన వారు. గ్రూప్ 3 ,2013, 2014 సంవత్సరంలో పుట్టిన వారు రాష్ట్ర స్థాయిలో పాల్గొనుటకు సిమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి గుర్తింపు పత్రం కచ్చితంగా ఉండవలెను లేనిచో పోటీలకు అనుమతించబడదు. మరిన్ని వివరాలకు 92992757888 నంబరును సంప్రదించాల్సిందిగా కోరడమైనది.

రైతులకు సత్వర న్యాయం చేయండి

గ్రీన్ కో సోలార్ ప్లాంటును పరిశీలించిన జిల్లా కలెక్టర్..



విశాలాంధ్ర - పాణ్యం : మండల పరిధిలోని పిన్నాపురం గ్రామ సమీపంలో గల గ్రీన్ కో సోలార్ ప్లాంట్ ను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ శనివారం పరిశీలించడం జరిగింది. గ్రీన్ కో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఎన్ని ఎకరాలు సేకరించారు,అందులో ఎంతమంది రైతులకు నష్టపరిహారం చెల్లించారు అని గ్రీన్ కో సోలార్ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అందులో భాగంగా గ్రీన్ కో సోలార్ ప్రాజెక్టు కొరకు సుమారు ప్రభుత్వం 2600 ఎకరాలు కేటాయించిందన్నారు.గ్రీన్ సోలార్ ప్రాజెక్టు కొరకు సేకరించిన భూ వివరాలు,నష్టపరిహారం అందజేసిన రైతుల వివరాల ఫైల్ ఆమె పరిశీలించారు.అందులో 603 ఎకరాలకు సంబంధించి రైతులకు నష్టపరిహారం ఎందుకు చెల్లించలేదని గ్రీన్ కో సోలార్ ప్రతినిధులైన నాయుడు,శ్రీనివాసరావును ఆమె ప్రశ్నించారు. త్వరితగతిన దీనికి సంబంధించిన రైతులకు న్యాయం చేయాలని ఆమె గ్రీన్ కో కంపెనీ ప్రతినిధులను ఆదేశించడం జరిగింది.లేని పక్షంలో మీపై శాఖాపరమైన చర్యలు జిల్లా కలెక్టర్ తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవో విశ్వనాథ్,తహసిల్దార్ నరేంద్ర కుమార్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శివశంకర్ రెడ్డి,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సాయి భారతి విద్యాసంస్థల అధినేతకు ఆహ్వానం



విశాలాంధ్ర - ఆదోని రూరల్ : పట్టణంలోని కార్బన్ పేట కాలనీలో వెలసిన చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఈనెల 19, 20,21 తేదీలలో జరుగు హోమము, లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట,ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ట వంటి కార్యక్రమాలకు సాయి భారతి విద్యాసంస్థల అధినేత బీసీ.దుర్గేష్ ను ఆలయ కమిటీ సభ్యులు కరపత్రాన్ని అందజేసి ఆహ్వానము కోరారు.శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ పెయింటింగ్ కు గాను సాయి భారతి విద్యా సంస్థల అధినేత బీసీ దుర్గేష్ తన సొంత నిధులతో రూ.,45 వేలు ఇవ్వడంతో ఆలయ కమిటీ సభ్యులు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ దుర్గేష్ కుటుంబ సమేతంగా వచ్చి శ్రీ చెన్నకేశవ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించే స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆకాంక్షించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ :బాలల దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా ప్రధాన న్యాయమూర్తి/జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి.కబర్ధి ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ అయిడ్ డిఫేన్స్ కౌన్సెల్ యెస్.మనోహర్,టౌన్ మోడల్ స్కూల్ నందు శనివారం వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న హై స్కూల్ 8,9,10వ తరగతి విద్యార్థులకు "బాల హక్కులు - న్యాయ సేవ - భారత రాజ్యాంగం" అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారికి, ఈ నెల 20న జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా, జిల్లా కోర్ట్ ఆవరణము నందు గల జిల్లా న్యాయ సేవాధికర సంస్థ నందు, జిల్లా జడ్జి గారి చేతులమీదగా, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారని తెలియజేశారు. జిల్లా విద్యా సహాయాధికారి హనుమంత రావు,టౌన్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి నివేదిక పత్రాలను అందించిన దాత

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుంద జిల్లా పరిషత్ హై స్కూల్లో చదివే రెండువేల మంది విద్యార్థులకు దాతపూర్వ విద్యార్థి మిక్కిలినేని వెంకట శివ ప్రసాద్ విద్యార్థుల ప్రగతి నివేదిక పత్రాలను ముద్రించి అందించారని శనివారం హెడ్మాస్టర్ నజీర్ అహమ తెలిపారు. విద్యార్థుల ప్రగతి నివేదిక పత్రాలను మల్టీ కలర్ లో ముద్రించి 25 వేల రూపాయలు ఖర్చు చేశారని అన్నారు విద్యార్థుల ప్రగతి నివేదిక పత్రాలు అందించిన దాతకు హెడ్మాస్టర్, ఎం ఎస్ ఎం సి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. హై స్కూల్ అభివృద్ధికి దాత ఎంతో సహకరిస్తున్నారని భవిష్యత్తులో కూడా ఎన్నో పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తుప్పు పట్టిన వాహనం.. పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుంద ఎల్ ఎల్ సి కార్యాలయ ఆవరణంలో వాహనం తుప్పుపట్టిపోయిందని దీనిని అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఎల్‌ఎల్‌సి నీరు జర సోడియం కాకుండా ఉండడా నికి సిబ్బంది వాహనంలో రాత్రి వేళల్లో ప్రయాణించేవారు. వాహనంలో గస్తీ తిరిగి నీరు వృధా కాకుండా అధికారులు, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించేవారు. వాహనం టైర్లను తీసివేసి నెలకు పెట్టడం వల్ల వర్షానికి నాని వాహనం పూర్తిగా తుప్పు పట్టి పోయిందని ప్రజలు పేర్కొన్నారు. గతంలో ఎల్ ఎల్ సి పనులు కోసం ఈ సిమెంట్ బస్తాలు, కంకర రాళ్ళను అధికారులు తరలించేవారు. వాహనంలోని కొన్ని సామాన్లను ఎవరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుని వెళ్లారు. తుప్పు పట్టిన వాహనం ఎన్నో ఏళ్ల నుంచి ఉందని దీనివల్ల ఆవరణంలో పాములు చేరే అవకాశం ఉందని కాలనీవాసులు ఐ ఆందోళన చెందారు. ఇప్పటికైనా వాహనాన్ని వేలం వేస్తే ఖజానాకు డబ్బు వస్తుందని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పిల్లలకు ఉచితంగా టెస్టులు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్రీయ స్వాస్థ్య కార్యక్రమములో భాగంగా నంద్యాల జిల్లాలోని బాల పుట్టినప్పటినుండి 18 సంవత్సరముల వయసు గల పిల్లలందరికి వారిలో ఉన్న వ్యాధులు, వైకల్యాలు పూర్తిగా తల నుండి కాలి వరకు స్క్రీనింగ్, చేసి తొలి దశలోనే వ్యాధులను గుర్తించి, అవసరమైన వారికి చికిత్సలు మరియు సేవలు అందించడంలో భాగంగా, శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్. వెంకట రమణ పరీక్షలు ప్రారంభించారు. స్క్రీనింగ్ కార్యక్రమము ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ వెంకట రమణ నంద్యాల పట్టణం హోలీక్రాస్ ఉన్నత బాలికల పాఠశాలలో స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బందితో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ స్క్రీనింగ్ లో ముఖ్యంగా నాలుగు విభాగాలకు సంబంధించిన నాలుగు రకాల వ్యాధులను గుర్తిస్తారని, పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, పోషకాహార వయసుతో పాటు పెరుగుదలలో అభివృద్ధి ఆలస్యం, మొదలగు 30 రకాల తీవ్ర స్థాయిలో ఉన్న వ్యాధులను గుర్తించుట కొరకు ప్రభుత్వము ఈ కార్యక్రమాన్ని నిర్మాణాత్మకంగా అమలు చేయడానికి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని, గుర్తించిన పిల్లందరికి స్క్రీనింగ్, మెడికల్, శస్త్ర చికిత్సల ద్వారా సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ సేవలు నంద్యాల జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో సుమారు 121759, 1-10 తరగతుల విద్యార్థులు 151084 మంది పిల్లలకు స్క్రీనింగ్ చేయనున్నారని డాక్టర్ కాంతారావు నాయక్, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమము నిర్వహణ అధికారి తెలిపారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలు ప్రతి గురువారం, శనివారం, అంగన్వాడీ కేంద్రములోని పిల్లలకు, పాఠశాల విద్యార్థులకు రోజుకు 30 మంది పిల్లలకు చేస్తారని వారు తెలిపారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

టవిశాలాంధ్ర - ఆళ్లగడ్డ : గ్రామ పంచాయితీలలో జరిగే అభివృద్ధికి అందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆళ్లగడ్డ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రతి అధికారి అభివృద్ధి గురించి తెలియజేయాలన్నారు. ప్రతి గ్రామంలోని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి లకు గ్రామాలలో చేయాల్సి ఉన్న పనులు గురించి చెప్పాలని సమన్వయంతో అందరూ కలిసికట్టుగా పని చేసి గ్రామాలను అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లి ప్రజల మన్ననలను పొందాలన్నారు. కొన్ని గ్రామాలలో అభివృద్ధికి సంబంధించి జరిగే పనులకు గ్రామ సర్పంచ్ లకే తెలియకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు ఏర్పాటు చేసి తీర్మానాలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. చివరగా తూతూ మంత్రంగా సర్పంచ్ లకు చెప్పి వారితో మొక్కుబడిగా సంతకం చేయించుకుంటున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. తిరిగి ఇలాంటివి పునారావృతమైతే అధికారుల పనితీరుపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి విషయంలో అధికారులకు సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు సహకరిస్తారని అధికారులందరూ వారితో కలిసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, తహసిల్దార్ లు ఉన్నారని వారి ముందే తాను చెబుతున్నానని ప్రతి పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ లతో కలిసి వారితో చర్చించి గ్రామసభల్లో అభివృద్ధికి సంబంధించిన తీర్మానాలను తయారు చేయాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచులకు అధికారులు తెలియజేయాలని, అభివృద్ధి విషయంలో సర్పంచ్ లు అందరూ సహకరిస్తారన్నారు. అనంతరం అధికారులు తమ తమ శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తాహసిల్దార్ జ్యోతి రత్నకుమారి, జడ్పిటిసి రాచంరెడ్డి లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీలు నాసారి ప్రసాద్, దాదా పీర్, ఎంఈఓ శోభా వివేకవతి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాల పర్యవేక్షణ

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండలంలోని మల్లెం, తంగడంచ గ్రామలలో శనివారం ముఖ్య ప్రణాళిక అధికారి జే.వేణుగోపాల్ పర్యటించి, మొక్కజొన్న పంట కోత ప్రయోగాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రణాళిక అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ మల్లెం గ్రామంలో 28.770 కేజీ.గ్రాములు, అలాగే తం గడంచ గ్రామంలో 15.660 కేజీ.గ్రాములు దిగుబడి వచ్చినట్లు ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) తెలిపారు. క్షేత్రస్థాయి అనంతరం తహశీ ల్దార్ కార్యాలయం సందర్శించి రెవెన్యూ వర్షమాపక కేంద్రం ను తనిఖీ చేశారు.అనంతరం కార్యాలయంలో గణాంక శాఖకు సంబంధిం చిన పలురికార్డులను పరిశీలించారు. వారి వెంట తాసిల్దారు చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తాసిల్దారు సత్యదీప్,మండల సహాయ గణాంకాధికారి హనుమంతు, పంటల బీమా ఏజెంట్ అజ్మతుల్లా వీహెచ్ఏ బాలీశ్వర్, వీఆర్ఓలు ఈశ్వరయ్య,రహీం,వీహెచ్ఏ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.18,27,724

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని చౌడేశ్వరి దేవత దేవస్థానం నందు 07-08-2024 నుండి 16-11-2024 వరకు హుండీ లెక్కించగా 18,27,724/- రూపాయలు డబ్బులు లభించినట్లు అసిస్టెంట్ కమిషనర్,కార్యనిర్వహణాధికారి జి.కామేశ్వరమ్మ,దేవాదాయ శాఖ తనిఖీ అధికారి హరిశ్చంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు ,నందవరం గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ బాబు మరియు ఆళ్లగడ్డ సేవ సమితి సంఘం వారు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

విశాలాంధ్ర - రుద్రవరం : వ్యాధి నిరోధక టీకాల వినియోగంపై గర్భిణీలు బాలింతలకు శనివారం అవగాహన కల్పించడం జరిగిందని ఆలమూరు వైద్యాధికారి అమర్నాథరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలన్నారు. టీకాల పై అవగాహన లేకపోవడంతోనే అనేకమంది రోగాల బారిన పడుతున్నారని అన్నారు.ప్రతి బుధవారం శనివారం ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు ప్రభుత్వం సూచించిన ప్రకారము తప్పనిసరిగా టీకాలను వేయిస్తే పిల్లలు ఆరోగ్యంగానూ బలంగాను ఉంటారని ఆయన తెలిపారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని ఆళ్లగడ్డ ప్రభుత్వ గ్రంథాలయ అధికారిణి అరుణ కుమారి అన్నారు.శనివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు రంగనాథన్, పాతూరి నాగభూషణం, వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమంలో పాలుపంచుకున్న వారిని 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్మరించుకొని వారి సేవలను గుర్తు చేసుకోవాలని సూచించారు.గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాల ద్వారా విద్యార్థులు యువతీ యువకులు విజ్ఞానాన్ని పెంపొందించుకొని పోటీ పరీక్షల్లో రాణించి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని అరుణకుమారి సూచించారు.

పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలి

విశాలాంధ్ర - రుద్రవరం : మండలంలోని ప్రతి పంచాయతీలో ప్రణాళికల ప్రకారం గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ రాబోయే ఏడాదికి సంబంధించి ప్రతి గ్రామపంచాయతీలో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించి నిర్దేశిక లక్ష్యాల సాధన కొరకు ప్రణాళికలను తయారు చేయించి దాని కొరకు నిధులను కేటాయించి వాటిని అమలు చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకొని పనులను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి మాధవి, ఆయా శాఖలకు చెందిన పలువురు మండలాధికారులు .వెటర్నరీ వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, వ్యవసాయ అధికారి నాగేంద్రప్రసాద్, మండల పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ షద్రక్ బాబు, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్, పలువురు పంచాయతీ కార్యదర్శులు,ఎంపీటీసీలు,సర్పంచులు,అధికారులుతదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ : మెడికల్ ఆఫీసర్ శివ శంకర్

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలం టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బనగానపల్లి 5 సచివాలయం రవ్వలకొండ సమీపాన మోడల్ స్కూల్ నందు బాల బాలికలకు స్క్రీనింగు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ శివ శంకర్ పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ పిల్లలు పౌష్టిగా ఆహారము లోపం, రక్తహీనత మరియు పౌష్టిక ఆహార సమస్యలు లేకుండా ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా జ్వరం, దగ్గు, ఆకలి లేకపోవడం ,బరువు తగ్గడం, ఎదుగుదల లేకపోవడం మొదలగునవి సమస్యలు ఉంటే డాక్టర్ ని సంప్రదించి తగు సూచనలు సలహాలు తీసుకోవలసినదిగా తెలపడం జరిగింది. శనివారం నుండి నెల రోజులు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ప్రైమరీ స్కూల్లో ప్రైమరీ స్కూళ్లలో పిల్లలందరికీ పుట్టిన పిల్లలనుండి 18 సంవత్సరాల లోపు వరకు అందరికీ స్క్రీనింగ్ చేయడం జరుగుతుంది కావున అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ .ఎస్ వెంకటేశ్వర్లు ,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శేఖర్ , ఎం ఎల్ హెచ్ పి రమేష్, ఆరోగ్య కార్యకర్త గ్రేసమ్మ, ఆశ వర్కర్లు , విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా... గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలి



విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూల్ : రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కర్నూల్ డి ఎల్ పి ఓ లక్ష్మీ తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2025 -26పై శనివారం కర్నూల్ ఎంపీపీ హాల్లో కర్నూలు మండల పరిధిలోని సర్పంచ్ లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిఎల్పిఓ లక్ష్మీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించి గ్రామ సభ తీర్మానంతో అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సభల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డి. వెంకటేశరమ్మ, ఎంపీడీవో రఘునాథ్,ఈఓఆర్ డి.అనురాధ,వైఎస్ ఎంపీపీ నెహమియ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.